సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 17 । జూలై । 2023



మామను హత్య చేసిన అల్లుడు

భూ తగాదాలు, డబ్బుల పంపకంలో తేడాలు రావడంతో పోల్కంపల్లిలో మామను అల్లుడు హత్య చేశాడు. -8లో



అజ్ఞానులే విమర్శిస్తున్నారు

తెలంగాణ చరిత్ర తెలియని అజ్ఞానులే కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
32°/24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

భువనగిరి టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని సూచించారు.

యాదాద్రి ప్రధానార్చకుడికి తపోనిధి బిరుదు



ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ప్రధానార్చకుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులకు ధార్మిక తపోనిధి బిరుదును తెలంగాణ రాష్ట్ర విద్వత్సభ ప్రకటించింది. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యా సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రధానార్చకుడికి ఈ బిరుదును సప్తమ వార్షిక విద్వత్సమ్మేళనంలో అంకితం చేశారు. ఆగమ శాస్త్రాల్లో ప్రావీణ్యులైన లక్ష్మీనరసింహాచార్యులు యాదాద్రి పుణ్యక్షేత్రంలో ఎనలేని సేవనందిస్తున్నందుకుగాను ధార్మిక తపోనిధి బిరుదును ప్రదానం చేశారని ఆయన వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జెండావిష్కరణలో పాల్గొన్న నారాయణరెడ్డి

బీబీనగర్ : గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి కోరారు. బీబీనగర్ మండలం రాయరావుపేటలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, వరంగల్ రైల్వే కోచ్‌తో పాటు బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కృష్ణ, యాదగిరి, సుమన్‌గౌడ్, బాల్‌శెట్టి,పావని, గీత, శేఖర్‌తో పాటు మరికొందరు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, సాయి, వినోద్, రాజేందర్, శ్రీనివాస్, దర్శన్ పాల్గొన్నారు.

16వ రోజుకు సమ్మె



నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న స్వీపర్లు

భువనగిరిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని భువనగిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట పాఠశాలల స్వీపర్లు చేపట్టిన సమ్మె ఆదివారం 16వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పని చేస్తున్నామని, పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను నరసింహ, ఉపాధ్యక్షుడు బైరు జంగయ్య, సహాయ కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి తుమ్మకుంట రమేష్, కార్యవర్గ సభ్యులు బాలమని, తడక భిక్షపతి, స్వామి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యలో అడ్మిషన్లకు దరఖాస్తులు

నల్లగొండ రూరల్ : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మహిళా డిగ్రీ కళాశాల సెంటర్‌లో డిగ్రీలో అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దూర విద్య కోఆర్డినేటర్ రాజారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఇంటర్ సమాన, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోపు అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. వివరాల కోసం 7382929758, 8919436579 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

నారసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం తర్వాత మూలవర్యులకు నిజాభిషేకం జరిపించి తులసీదళాలతో అర్చించారు. అదే విధంగా ప్రథమ ప్రాకార మండపంలో స్వామివారికి శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



అల్లందేవిచెర్వు గ్రామంలో కప్పకాముడు ఆడుతున్న మహిళలు

వరుణదేవా కరుణించు

సంస్థాన్ నారాయణపురం : వర్షాలు కురువాలని సంస్థాన్‌నారాయణపురం మండలంలోని అల్లం దేవిచెర్వు గ్రామస్తులు ఆదివారం కప్పకాముడు ఆడారు. కప్పలకు పెళ్లి చేసి పాటలుపాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వాటిపై బిందెలతో నీళ్లు పోస్తూ వరుణదేవా కరుణించమని వేడుకున్నారు. అదే విధంగా బొడ్రాయికి జలాభిషేకం, గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వానలు కురువకపోవడంతో విత్తిన విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నాయని, మొలకలు ఎండిపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ప్రగతికి పునాది

రాయరావుపేట ఇండస్ట్రియల్ పార్కులో ఊపందుకున్న పనులు

- చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు పునాదులు
- మరికొన్ని యూనిట్ల నిర్మాణానికి నిర్వాహకుల సన్నాహాలు
- టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో వసతుల కల్పన
- పూర్తయితే వందలాది మందికి ఉపాధి



రాయరావుపేటలోని ఇండస్ట్రియల్ పార్కులో నిర్మాణం పూర్తి చేసుకున్న యూనిట్

బీబీనగర్ : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రాయరావుపేట పారిశ్రామికవాడలో యూనిట్‌ల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితమే భూ సేకరణ పూర్తి కాగా భూమి అభివృద్ధి, ప్లాట్ల విభజన, మౌలిక సౌకర్యాల కల్పనలో జాప్యం చోటు చేసుకుంది. ఎట్టకేలకు పనుల్లో కదలిక రావడంతో ఈప్రాంతవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం ఐదుకు పైగా కంపెనీల నిర్మాణాలు కొనసాగుతుండగా మరికొన్నింటి ఏర్పాటుకు భూమి చదును చేస్తున్నారు.

39 ఎకరాల్లో పార్క్

కాలుష్యరహిత కంపెనీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. హైదరాబాద్ జంటనగరాలకు దూరంగా ఉన్న గ్రామాలను ఎంచుకొన్ని అక్కడ పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా బీబీనగర్ మండలంలోని రాయరావుపేట పరిధిలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం నాలుగేళ్ల క్రితం 39 ఎకరాల భూమి కేటాయించి రూ.3.8 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు పార్క్‌లో మొత్తం 180 ప్లాట్లను సిద్ధం చేశారు.

150 ప్లాట్లు కొనుగోలు

ఇండస్ట్రియల్ పార్కులో 180 ప్లాట్లు ఏర్పాటు చేయగా అందులో 150 ప్లాట్లను ఇప్పటికే పారిశ్రామికవేత్తలు కొనుగోలు చేశారు. చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలుగా ఒక్కో ప్లాట్ 500 నుంచి 1500 గజాల చొప్పున చేశారు. ఇక్కడ వాహనాల యంత్ర పరికరాలు, ఇంజనీరింగ్, బోర్‌వెల్ వంటి వివిధ రకాల పనిముట్ల తయారీకి ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. దీంతో హైదరాబాద్ జంటనగరాల్లోని పారిశ్రామికవాడల్లో గల పలు చిన్నతరహా పరిశ్రమలు ఇక్కడికి తరలి రానున్నాయి.

పార్క్‌లో కల్పించిన సౌకర్యాలు

పార్క్‌లోని లేఅవుట్‌లో అవసరమైన సౌకర్యాలు సమకూర్చారు. ప్రధానంగా రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఉద్యోగులకు నివాసాలు, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మరిన్ని వసతులు కల్పించాలి

రాయరావుపేట ఇండస్ట్రీయల్ పార్క్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంతమేరకే మౌలిక వసతులు కల్పించారు. పరిశ్రమల నిర్మాణం వేగంగా జరగాలంటే మరిన్ని వసతులు సమకూర్చాలి. పరిశ్రమలు అందుబాటులోకి వస్తే అభివృద్ధిలో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

– బాలనర్సింహగౌడ్, పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు

వడివడిగా నిర్మాణాలు

రాయరావుపేట పార్క్‌లో మౌలిక వసతులు సమకూరడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన పారిశ్రామికవేత్తలు ఒక్కొక్కరుగా యూనిట్‌ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం ఐదుకు పైగా కంపెనీల పనులు కొనసాగుతున్నాయి. మరికొన్ని పరిశ్రమల యూనిట్లు నెలకొల్పేందుకు నిర్వాహకులు భూములు చదును చేస్తున్నారు. వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు కానుండడం, అవన్నీ అందుబాటులోకి వస్తే వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందనుంది.



యూనిట్‌ల ఏర్పాటుకు పార్క్‌లో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

దేశానికి అక్షయపాత్రగా తెలంగాణ

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మల్లగూడెంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత

రాజాపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మూడు పంటలు పండిస్తూ దేశానికి అక్షయపాత్రగా తెలంగాణ మారిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. రాజాపేట మండల కేంద్రంలో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అటువంటి వాటికి ఆస్కారం లేకుండా కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా జరుగుతుండగా.. కాంగ్రెస్ నాయకులు మాత్రం తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామనడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని దేశం కీర్తిస్తుంటే కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌కు రైతులంతా బాసటగా నిలవాలని కోరారు. అదే విధంగా మల్లగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, సింగారం గ్రామంలో హీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని గొంగిడి సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బాలమణి, జెడ్పీటీసీ సభ్యుడు గోపాల్ గౌడ్, సర్పంచులు కర్ల కర్ణాకర్ రెడ్డి, గౌడుగు రాజు, ఆడెపు ఈశ్వరమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మెన్ భాస్కర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు భాస్కర్ గౌడ్, లక్ష్మణ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో పార్టీని మళ్లీ గెలిపిస్తాయని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామానికి చెందిన 50 మంది ఆదివారం భువనగిరిలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, సర్పంచ్ పర్నె రజిత మల్లారెడ్డి, ఉపసర్పంచ్ బైరు బాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, బైరు లక్ష్మయ్య, కొయ్యడ నర్సింహ, గుండ్ల భాస్కర్, శ్రీనివాస్, సిద్దగోని మల్లేశ్, మాధవరెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, అశోక్, భాను, భీమేశ్, శేఖర్, సాయి, రాహుల్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈ-మెయిల్, పోస్టుకార్డు ఉద్యమం

- మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

భువనగిరిటౌన్ : మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కేంద్రాన్ని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం నుంచి కోటి ఈ-మెయిల్, పోస్టుకార్డు ఉద్యమం చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆమనగంటి వెంకటేశ్ తెలిపారు. ఈ ఉద్యమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ-మెయిల్, పోస్టుకార్డుల ద్వారా తమ సందేశం పంపాలని పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరిలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోట రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య 70 రోజులుగా అల్లర్లు జరుగుతూ హింసాకాండ చెలరేగుతున్నా ప్రధాని మోదీ పట్టించుకోకుండా మౌనం వహించడం దేనికి అర్థమన్నారు. మణిపూర్‌లో తాజా పరిస్థితులను కేంద్రం తన రాజకీయ లబ్ధికోసం వాడుకోవాలనే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మోదీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దేశ ప్రధానిగా జోక్యం చేసుకోని మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కోరారు. అదే విధంగా ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మోదీ ఆ తర్వాత విస్మరించారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. నేటి నుంచి ఈనెల 25వ తేదీ వరకు ఈ మెయిల్, పోస్టుకార్డు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సహాయ కార్యదర్శులు బషీరుద్దీన్, శివవర్మ, గడ్డం వెంకటేష్, తిరుపతి, జగన్, జావీద్, మల్లం మహేష్, రోషిని ఖాన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను, మద్దాల ప్రభాకర్, చింతల రమేష్, బుగ్గ నవీన్, నరేష్ పటేల్, శ్రీకాంత్, నరేష్, అనిల్ రెడ్డి, సుజాత, సంజీవ, మహేష్, కిషోర్, ఆర్షదుద్దీన్, సాగర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా అద్దె భవనాల్లోనే!

- సొంత ఆఫీసులు లేని ప్రభుత్వ శాఖలు
- ఇరుకు గదుల్లోనే కార్యాలయాలు
- ఉద్యోగులకు తప్పని తిప్పలు
- అరకొర వసతులతో సతమతం
- ఏడేళ్లు కావొస్తున్నా బాలారిష్టాలు దాటని కొత్త జిల్లా

పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడిన యాదాద్రి భువనగిరి జిల్లా ఏడేళ్లు కావస్తున్నా బాలారిష్టాలు దాటలేదు. నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.



చౌటుప్పల్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్న నీటి పారుదల శాఖ కార్యాలయం

సాక్షి, యాదాద్రి : ప్రజలకు పాలన చేరువ చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ 11న జిల్లాల పునర్విభజన చేపట్టింది. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు అడ్డగూడూరు, మోటకొండూరు మండలాలు, చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసింది. నాడు హడావుడిగా అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాఖలు ఇంకా వాటిలోనే కొనసాగుతున్నాయి. ఏడేళ్లు కావస్తున్నా సొంత భవనాలకు నోచుకోలేదు. సౌకర్యాలు కూడా సమకూరకపోవడంతో ఇరుకు గదుల్లో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. నీడ వసతి, పార్కింగ్ లేక పనుల నిమిత్తం వచ్చేవారిని ఇబ్బందులకు గురి చేస్తోంది.

పోలీస్ కార్యాలయానికి స్థలంతోనే సరి..

నూతన జిల్లా ఆవిర్భావం అనంతరం పోలీస్‌శాఖను రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి జోన్‌లో చేర్చారు. డీసీపీ స్థాయి అధికారి పనిచేసే ఈ శాఖకు సొంత భవనం లేదు. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు డీఎస్పీ కోసం నిర్మించిన భవనంలోనే డీసీపీ కార్యాలయం, నివాస బంగ్లా కొనసాగుతోంది. హైదరాబాద్ –వరంగల్ జాతీయ రహదారి పక్కన రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం కోసం కేటాయించినా పనులు ప్రారంభించడం లేదు.

చౌటుప్పల్‌లో ఒక్క శాఖకూ సొంత భవనం లేదు

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైన చౌటుప్పల్‌కు ఆర్డీఓ, ట్రాన్స్‌కో డీఈ, ట్రాన్స్‌కో ఏడీఈ, నీటిపారుదల శాఖ డీఈ, పంచాయతీరాజ్ డీఈ, డీఎల్పీఓ, మిషన్ భగీరథ డీఈ, ఉద్యానవన శాఖల కార్యాలయాలు తరలివచ్చాయి. మరికొన్ని రావాల్సి ఉంది. తరలివచ్చిన శాఖల్లో ఏ ఒక్కదానికీ సొంత భవనం లేదు. ఆర్డీఓ కార్యాలయాన్ని మండల పరిషత్ భవనంలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఏడీ ఆఫీస్‌ను నల్లగొండ జిల్లా మునుగోడులోని కార్యాలయంతో అనుసంధానించారు.

ఎండలో నిరీక్షించాల్సి వస్తోంది

అడ్డగూడూరు నూతన మండలంగా ఏర్పడి ఏడేళ్లు కావస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. ఇరుకైన గదుల్లో కార్యాలయాలు నిర్వహిస్తుండడంతో అధికారులను కలవడానికి ఇబ్బంది అవుతోంది. వసతులు కూడా లేకపోవడంతో అధికారుల కోసం ఎండలో, సమీప దుకాణాల్లో నిరీక్షించాల్సి వస్తుంది.

– వల్లభట్ల శ్రీనివాసరావు, గట్టుసింగారం, అడ్డగూడూరు మండలం

మోటకొండూరు మండలంలో ఇలా..



ఎస్సీ బాలుర హాస్టల్‌లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- మండల కేంద్రంలో పశువైద్య ఆస్పత్రి ఏర్పాటు చేయలేదు. డాక్టర్ కూడా లేదు.
- ఎంపీడీఓ కార్యాలయాన్ని పాత శాలలో నిర్వహిస్తున్నారు. సరైన స్థలం ఏకపోవడంతో సమావేశాల నిర్వహణ కష్టంగా మారింది. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.
- తహసీల్దార్ కార్యాలయం ఎస్సీ బాలుర హాస్టల్‌లో నడుస్తోంది. కార్యాలయానికి వచ్చేవారు వసతి గృహం స్థలంలో వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది.
- పోలీస్ స్టేషన్ సొంత భవనానికి నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి.
- ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం లేదు. ఏఓ ఆఫీస్ రైతు వేదికలో కొనసాగుతోంది.

అడ్డగూడూరులో..



ఇరుకు భవనంలో తహసీల్దార్ కార్యాలయం

- ఎంపీడీఓ కార్యాలయాన్ని మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్నారు.
- తహసీల్దార్ అద్దె భవనంలో కొనసాగుతోంది.
- వ్యవసాయ అధికారి రైతు వేదిక నుంచి విధులు నిర్వహిస్తున్నారు.
- పోలీస్‌స్టేషన్ పశుసంవర్ధక శాఖ ఆస్పత్రిలో నడుస్తోంది.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

భువనగిరి టౌన్ : యాదగిరిగుట్టలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరిలోని సీఐటీయూ కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. 'ప్రభుత్వ విధానాలు కార్మికులపై ప్రభావం–కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు' అనే అంశంపై శిక్షణ తరగతుల్లో వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భువనగిరి పట్టణ కన్వీనర్ గంధమల్ల మాతయ్య, కార్మికులు బట్టు కొండయ్య, గద్దె యాదగిరి, రాజలింగం, సిరిపంగి రవి, చల్ల రాజయ్య, మాచర్ల రాములు, కొమ్ము వరమ్మ, చల్ల శ్యామల,అండాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి ముందు బాధితుడు జగదీశ్వర్ కుటుంబం

నిడమనూరు: మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన బాగం జగదీశ్వర్ ఇల్లు శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి జగదీశ్వర్, అతడి భార్య, ఇద్దరు పిల్లలు భోజనం చేసి ఆరు బయట నిద్రించారు. అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగడంతో మెలకువ వచ్చి లేచి చూస్తే అప్పటికే ఇళ్లు మొత్తం మంటలు వ్యాపించాయి. పిల్లల్ని నిద్ర లేపి దూరంగా తీసుకెళ్లారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో బియ్యం, వంట సామాన్లు, ధాన్యం, కొంత నగదు మొత్తం కాలి బూడిదయ్యాయని బాధితుడు పేర్కొన్నాడు. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని జగదీశ్వర్ కోరుతున్నాడు.

పాతబస్తీలో కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 10 బైక్‌లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన సరైన పత్రాలు లేని బైక్‌లు

నల్లగొండ క్రైం: పట్టణంలోని పాతబస్తీలో ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 10 బైక్‌లను సీజ్ చేయడంతో పాటు 15 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. ప్రజలకు పోలీసు శాఖ పట్ల భరోసా కల్పించేందుకే ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు.

రూ.6కోట్ల చిట్టీ డబ్బులతో ఉడాయించిన హిజ్రా

- పట్టుకుని పోలీసులకు అప్పగించిన బాధితులు

యాదగిరిగుట్ట రూరల్: చిట్టీ డబ్బులు రూ.6కోట్లతో ఉడాయించిన హిజ్రాను బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఓ హిజ్రా గత 25 సంవత్సరాల నుంచి ప్రజలతో మమేకమై చిట్టీల వ్యాపారం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో పట్టణానికి చెందిన సుమారు 50 మంది వ్యక్తులు సదరు హిజ్రా వద్ద చిట్టీలు వేశారు. ఎత్తిన చిట్టీలు ఇవ్వకుండా తర్వాత ఇస్తానని చెప్పి, సుమారుగా రూ.6కోట్లతో ఎవరికీ నాలుగు రోజుల క్రితం ఆమె పారిపోయింది. విషయం తెలుసుకున్న బాధితులు హిజ్రా కోసం గాలించి పట్టుకుని ఆదివారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కాగా హిజ్రా ముందుజాగ్రత్తగా ఐపీ పెట్టుకుని పారిపోయిందని, ఆమె మీద కేసు చేయడానికి వీల్లేదని, ఆమెతో మాట్లాడి డబ్బులు సెటిల్ చేసుకోవాలని పోలీసులు బాధితులకు సలహా ఇచ్చారు.

మామను హత్య చేసిన అల్లుడు

- బండరాయితో తలపై మోది చంపిన నిందితుడు
- భూతగాదాలు, డబ్బు పంపకంలో తేడాలు రావడమే కారణం
- పెద్దఅడిశర్లపల్లి మండలం పోల్కంపల్లిలో ఘటన

పెద్దఅడిశర్లపల్లి: భూ తగాదాలు, డబ్బు పంపకంలో తేడాలు రావడంతో మామను అల్లుడు హత్య చేసిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆదివారం వివరాలు తెలియజేశారు. పోల్కంపల్లి గ్రామానికి చెందిన జక్కల చినమారయ్య(60), మంగమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మారయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు



చినమారయ్య (ఫైల్)

కుమార్తెలకు వివాహం చేసి తనకున్న భూమిలో ఒక్కొక్కరికి 3.20 ఎకరాల చొప్పున పంచి ఇచ్చాడు. కుమార్తెలకు పంచగా మిగిలిన భూమిలో ఇటీవల కొంత విక్రయించి వచ్చిన డబ్బును ఇద్దరు కుమార్తెలకు పంచి ఇచ్చాడు. కాగా పెద్దకుమార్తెకు కొంత ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో చిన్న కుమార్తె భర్త అయిన పెద్దవూర మండలం తెరాటిగూడెం గ్రామానికి చెందిన బొబ్బల నారాయణ తరచూ అత్తమామలతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం పోల్కంపల్లికి వచ్చిన చిన్న అల్లుడు నారాయణ అత్తతో గొడవపడి అప్పటికే గొర్రెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లిన మామ చినమారయ్య వద్దకు వెళ్లి గొడవపడ్డాడు. ఈ క్రమంలో నారాయణ బండరాయితో చినమారయ్య తలపై మోదాడు. దీంతో మారయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందగా.. నారాయణ అక్కడి నుంచి పరారయ్యాడు. చినమారయ్య మృతిచెందడంతో గొర్రెలు గ్రామంలోని పలువురి పొలాల్లో మేత మేస్తుండగా గ్రామస్తులు మారయ్య ఇంట్లో సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు చినమారయ్య కోసం శనివారం రాత్రి మొత్తం వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం తన వ్యవసాయ పొలంలో చినమారయ్య గ్రామస్తులకు విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ పరశురాం, ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'చంద్రయాన్–3'ని వీక్షించడం గొప్ప అనుభూతి

నల్లగొండ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట నుంచి ఈ నెల 14న ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్–3 శాటిలైట్ ప్రయోగాన్ని నల్లగొండ పట్టణానికి చెందిన కేంద్రీయ విద్యాలయం పూర్వ విద్యార్థినులు కత్తుల సిరిచందన, చలోజు దీక్షిత ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ ప్రయోగం ప్రత్యక్షంగా వీక్షించడం గొప్ప అనుభూతి అని వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



ఇస్రో గేటు వద్ద ఫొటో దిగిన విద్యార్థినులు

ఎల్ఈడీ ద్వారా వీక్షించాం



నేను గతంలో చంద్రయాన్–2 ప్రయోగాన్ని కూడా ప్రత్యక్షంగా వీక్షించడానికి వెళ్లాను. ఈసారి చంద్రయాన్–3 ప్రయోగాన్ని వీక్షించడానికి అవకాశం రావడంతో శ్రీహరికోటకు వెళ్లాను. కిలోమీటరు దూరంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. మేము అక్కడి నుంచి ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూశాం. అదో గొప్ప అనుభూతి, ఎప్పటికీ మరిచిపోలేం.

– కత్తుల సిరిచందన, విద్యార్థిని, నల్లగొండ

దేశానికి ఎంతో ప్రతిష్టను తెచ్చింది



చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో దేశ ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోయింది. దేశంలో ఇస్రో సైంటిస్టులు చేస్తున్న కృషి మరువలేనిది. ఈ ప్రయోగాన్ని దగ్గర నుంచి చూడడం జీవితంలో మరిచిపోలేను. చంద్రయాని–2 ఫెయిల్ కావడం బాధ అనిపించినా.. చంద్రయాన్–3 విజయవంతం కావడం ఆనందంగా ఉంది.

– చలోజు దీక్షిత, విద్యార్థిని, నల్లగొండ

బతుకుదెరువు కోసం వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

మఠంపల్లి: బతుకుదెరువు కోసం మఠంపల్లి మండలానికి వలస వచ్చిన వ్యక్తి ఆదివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం అజయ్‌తండాకు చెందిన బానోతు బాలాజీ నాయక్(56), సుగుణ భార్యాభర్తలు. వీరికి నలుగురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహం చేశారు. భార్యాభర్తలు ఇద్దరూ రెండేళ్ల క్రితం మఠంపల్లి మండలంలోని కాల్వపల్లితండాలో గల తమ బంధువుల వద్దకు వచ్చి ఇక్కడే భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిరోజు ఇద్దరూ తమ టీవీఎస్ మోపెడ్‌పై కాల్వపల్లితండా నుంచి మఠంపల్లికి వచ్చి కూలీ పనులు చేసుకుని ఇంటికి వెళ్తుంటారు. రోజుమాదిరిగా ఆదివారం సాయంత్రం కూడా మఠంపల్లిలో పను



ఘటనా స్థలంలో బాలాజీ నాయక్ మృతదేహం

లు ముగించుకుని టీవీఎస్ మోపెడ్‌పై భార్యాభర్తలు కాల్వపల్లితండాకు బయల్దేరారు. ఈ క్రమంలో మఠంపల్లి మండల కేంద్రం సమీపంలోని మోడల్‌స్కూల్ వద్ద బొలేరో వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వడంతో గాయపడిన సుగుణను చికిత్స నిమిత్తం, బాలాజీనాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు. అయితే బొలేరో వాహనం డ్రైవర్ మద్యం మత్తులో టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడని స్థానికులు చెబుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

బీబీనగర్: మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్‌కు చెందిన సప్పిడి శ్రీను(19) తన స్నేహితుడు విష్ణుతో కలిసి హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు పల్సర్ బైక్‌పై వస్తుండగా గూడూరు టోల్‌ప్లాజా దాటగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న శ్రీను అక్కడికక్కడే మృతిచెందగా, విష్ణు



ఘటనా స్థలంలో శ్రీను మృతదేహం

తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, విష్ణును చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తుర్కపల్లి: ఒంటిపై పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బరిగే యాదగిరి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి గత కొన్ని రోజులుగా భార్య అండాలుతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి యాదగిరి ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా యాదగిరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

మహిళ అదృశ్యం

రామన్నపేట: మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. దుబ్బాక గ్రామానికి చెందిన ఏటెల్లి ఉపేందర్‌కు మూడున్నర సంవత్సరాల క్రితం వలిగొండ మండలం మొగిలి పాక గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది.



లావణ్య

వీరికి సంతానం లేదు. ఈ నెల 13వ తేదీన లావణ్య తల్లిగారింటికి వెళ్లింది. రోజూ భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుంది. కాగా ఈ నెల 15న లావణ్య కనిపించడం లేదని ఆమె తల్లిగారి ఇంటి నుంచి ఫోన్ రావడంతో బంధువులు, పరిచయస్తుల ద్వారా ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆది వారం ఆమె భర్త ఉపేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రవరానికి ఆర్టీసీ బస్సులు

కోదాడఅర్బన్: కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలో గల ఉగ్ర బాలానర్సింహస్వామి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం సోమవారం నుంచి ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు కోదాడ డిపో నుంచి బస్సులు నడుపుతున్నట్లు కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష ఆదివారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచి ఎర్రవరానికి మధ్యాహ్నం 2గంటలకు బస్సు బయల్దేరుతుందని, అదే విధంగా ప్రతి రోజు ఉదయం 3.30గంటలకు ఎర్రవరం నుంచి హైదరాబాద్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా కోదాడ నుంచి ఎర్రవరానికి చార్జీలు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి సమాచారం కొరకు 9959226302 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారంలో ఆదివారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం గ్రామానికి చెందిన ముదిగొండ మల్లేష్ (26)ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

- కుమారుడి రెండు కిడ్నీలు చెడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు
- కూలి పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ
- వైద్యం కోసం ఇప్పటికే రూ.5లక్షలు అప్పు
- మనసున్న మారాజులు ఆదుకోవాలని వేడుకోలు



భరత్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి నాగలక్ష్మి

కన్నీటి గాథ

మిర్యాలగూడ టౌన్: ఓ వైపు తమ కుమారుడి రెండు కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితం కాగా.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో అప్పు చేసి మరీ కుమారుడికి వైద్యం చేయిస్తూ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది ఓ పేద కుటుంబం. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని 2వ వార్డు తాళ్లగడ్డకు చెందిన చుట్టూరి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. కుమార్తె జ్యోతిక పీజీ చదువుతుండగా, పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ డిగ్రీ చదువుతున్నాడు. రెండో కుమారుడు భరత్ కూలీ పనులు చేస్తున్నాడు. శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులు కూలీ పనులు చేస్తూ పిల్లలను కష్టపడి చదివిస్తున్నారు. కాగా రెండేళ్ల క్రితం వారి రెండో కుమారుడు భరత్ అనారోగ్యానికి గురికాగా మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓజోన్ ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా.. అతడి రెండు కిడ్నీలు 90శాతానికి పైగా చెడిపోయాని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అప్పటి నుంచి వైద్యం కోసం పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేశారు. కొన్నిరోజుల తర్వాత నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయని చెప్పడంతో కుటుంబ సభ్యులు మరింత కుంగిపోయారు. వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. అప్పులు పెరిగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రిలో ఉండలేక కుమారుడిని ఇంటికి తీసుకొచ్చారు. కాగా వారానికి ఒకసారి మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సుమారు రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి కిడ్నీలు దానం చేస్తే చూసుకోవాలని వైద్యులు అంటున్నారని వాపోయారు. ప్రస్తుతం శ్రీనివాస్ హమాలీ పనిచేస్తుండగా, నాగలక్ష్మి ఓ హోటల్‌లో కూలీ పనులు చేస్తుంది. వచ్చిన డబ్బులతోనే కుటుంబాన్ని వెళ్లదీసుకుంటున్నారు. దయార్ధ హృదయులు ఆర్థికసాయం అందిస్తే తమ కుమారుడి ప్రాణాలు కాపాడుకుంటామని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

భరత్ తండ్రి శ్రీనివాస్ బ్యాంక్ అకౌంట్ నంబర్ – 1491155000032558
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ – కేవీబీఎల్ 000149
కరూర్ వైశ్యా బ్యాంకు, సాగర్ రోడ్డు, మిర్యాలగూడ. భరత్ తండ్రి శ్రీనివాస్
ఫోన్ నంబర్ : 9885842919

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

గరిడేపల్లి: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకీడు మండల కేంద్రానికి చెందిన పుట్టల వెంకన్న(43) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య కల్పన, ఇద్దరు కుమారులున్నారు. తన ఇద్దరు కుమారులు ఖమ్మంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో చదువుకుంటున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో బైక్‌పై పాలకీడు నుంచి ఖమ్మం బయల్దేరిన పుట్టల వెంకన్న గరిడేపల్లి మండలం అప్పనపేట గ్రామం వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటోను బైక్ ఢీకొట్టింది. దీంతో వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గరిడేపల్లి పోలీసులు తెలిపారు.

చౌటుప్పల్ పరిధిలో మరొకరు..



శివశంకర్ (ఫైల్)

చౌటుప్పల్: మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామ శివారులో పిలాయిపల్లి కాలువ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 10వ వార్డు పరిధిలో గల మార్కండేయనగర్‌కు చెందిన పంతంగి శివశంకర్(34) బైక్‌పై ఎస్.లింగోటం వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిలాయిపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డుపై తీవ్రగాయాలతో మృతిచెంది ఉన్నాడు. అటుగా వెళ్లే వ్యక్తులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు స్థానికంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న ఓ డాక్యుమెంట్ రైటర్ వద్ద పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేదా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి మృతిచెందాడో తెలియరాలేదు.

మాణిక్‌రావు ఠాక్రేకు వినతిపత్రం అందజేత



మాణిక్‌రావు ఠాక్రేకు వినతిపత్రం అందజేస్తున్న పాశం నరేష్‌రెడ్డి

నల్లగొండ: జిల్లాలోని న్యాయవాదులు, మేధావులు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలను కాంగ్రెస్ వైపు ఆకర్షించేలా దృష్టి సారించాలని కోరుతూ ఆదివారం ఢిల్లీలో ఏఐసీసీ ఇన్‌ఛార్జి సెక్రెటరీ మాణిక్‌రావు ఠాక్రే నివాసంలో ఆయనకు నల్లగొండ డీసీసీ అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలోని నాయకులను కలుపుకొని కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు నరేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రతో పార్టీ మెరుగుపడ్డదని, కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఎండగడుతూ ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.

సరస్వతీ పుత్రుడికి ఆర్థిక చేయూతనివ్వరూ..

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, ప్రత్యేక కోచింగ్ లేకుండానే ఐఐటీకి ఎంపిక
- ఫీజు చెల్లించే స్థోమత లేక ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు

పెద్దవూర: మండలంలోని పొట్టివానితండాకు చెందిన రమావత్ నాగ, సునీత దంపతుల కుమారుడు రమావత్ శివాజీకి జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్బాద్ ఐఐటీలో సీటు వచ్చింది. కానీ తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక కళాశాల, హాస్టల్ ఫీజు, ప్రయాణ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో శివాజీ ఆలిండియా లెవల్‌లో 19,376 ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 196వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు గ్రామాల్లో తిరుగుతూ సీజనల్‌గా పండ్లను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివాజీ ఒకటి నుంచి 5వ తరగతి వరకు తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ఆరు నుంచి 10వ తరగతి వరకు పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో చదివాడు. పదో తరగతిలో 9.7జీపీఏ సాధించాడు. ఇంటర్మీడియట్ పెద్దవూర మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల కళాశాలలో చదివి 861 మార్కులు తెచ్చుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఐఐటీలో చదివే అవకాశాన్ని సాధించాడు.



తల్లిదండ్రులతో శివాజీ

సాయం కోసం వేడుకోలు

ఐఐటీలో సీటు కన్ఫర్మేషన్ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ.20వేలను బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆర్థికసాయం చేయడంతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కానీ కళాశాల ఫీజు, హాస్టల్ ఫీజు, ప్రయాణ ఖర్చులు చెల్లించే ఆర్థిక స్థోమత శివాజీ తల్లిదండ్రులకు లేదు. దీంతో దయార్థ హృదయులు ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు. సహాయం చేయాలనుకునే వారు 7730043402 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా అదే నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా తోచినంత సహాయం చేయాలని వేడుకుంటున్నాడు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24న సీఎం కేసీఆర్ పాల్గొననున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చివ్వెంల మండల కేంద్రంలోని వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ప్రభుత్వ వైద్య కళాశాల, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, మురుగు నీటిశుద్ధి కేంద్రంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నట్లు తెలిపారు. సూర్యాపేటకు కాళేశ్వరం జలాలలను అందించిన అభివృద్ధి ప్రదాతకు ధన్యవాదాలు తెలుపుటకు ప్రజలు వేలాదిగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ సోమ భరత్, రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ ధరావతు కుమారిబాబునాయక్, మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, జెడ్పీటీసీ సంజీవ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలోచన అదిరింది..!

బైక్‌పై వెళ్తున్నప్పుడు వర్షం నుంచి రక్షణ పొందేందుకు గాను చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన చిట్టిప్రోలు అశోక్ వినూత్న ఆలోచన చేశాడు. తన హోండా యాక్టీవాకు గొడుగు బిగించాడు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చునే వ్యక్తికి సైతం ఈ గొడుగుతో రక్షణ ఉండేలా డిజైన్ రూపొందించాడు. ఆదివారం యాక్టీవాపై అశోక్ చౌటుప్పల్‌కు రాగా, స్థానికులు ఎంతో ఆసక్తితో పరిశీలించారు. ఆలోచన అదిరింది అంటూ ఆయనను అభినందించారు.

– చౌటుప్పల్

